

టన్ను చీనీ రూ.31,190

అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.31,190, కనిష్టంగా రూ.10 వేలు, సరాసరిన రూ.16 వేల ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



కిలో టమాట రూ.33

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.33, కనిష్టం రూ.13, సరాసరిన రూ.23 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
32.8°/19.5°

జిల్లా పరిధిలో గురువారం పగటి ఉష్ణోగ్రతలు పెరిగాయి. చలి తీవ్రత కొంత తగ్గింది. ఆకాశం పూర్తిగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి నుంచి తుంపర్లు పడ్డాయి. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో వాయువ్య దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

జీవాలకు టీకాలు

- 30వ తేదీ వరకూ వేయనున్న అధికారులు
- ఉమ్మడి జిల్లాలో 27.91 టీకాల లక్ష్యం



అనంతపురం అగ్రికల్చర్: గొర్రెలు, మేకలకు పీపీఆర్ వ్యాధి సోకకుండా ముందస్తుగా ఈనెల 30వ తేదీ వరకు ఉచితంగా టీకాలు వేస్తున్నట్లు పశుసంవర్ధకశాఖ రెండు జిల్లాల జేడీలు డాక్టర్ జీపీ వెంకటస్వామి, డాక్టర్ జి.శుభదాస్, పశువ్యాధి నిర్ధారణ కేంద్రం (ఏడీడీఎల్) ఏడీ డాక్టర్ రామచంద్ర తెలిపారు. అనంతపురం జిల్లా పరిధిలో 24.39 లక్షలు, శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలో 27.91 లక్షలు మొత్తం 52.30 లక్షల సంఖ్యలో గొర్రెలు, మేకలకు టీకాలు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. జ్వరం, నోటిలో పుండ్లు, నిమోనియా, అబార్షన్, రక్త విరేచనాలు లాంటి లక్షణాలు కనిపిస్తే పీపీఆర్ వ్యాధిగా గుర్తించాలన్నారు. వ్యాధి సోకిన జీవాలకు నివారణ చర్యలు చేపట్టకపోతే చాలా వరకు మరణాలు సంభవిస్తాయని తెలిపారు. జీవాల పెంపకందారులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉన్నందున పీపీఆర్ వ్యాధి నివారణకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని సూచించారు. పుట్టిన పిల్లల నుంచి మందలో కొత్తగా చేరిన అన్ని జీవాలకు ఈనెల 30 లోపు పశుశాఖ అధికారులు, పారాస్టాఫ్‌ను సంప్రదించి టీకాలు వేయించుకోవాలన్నారు.

పారా లీగల్ వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం



హిందూపురం టౌన్: పారా లీగల్ వలంటీర్‌గా పనిచేసేందుకు ఆసక్తి ఉన్న యువతీ, యువకులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా అదనపు జడ్జి, మండల న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్ కంపల్లె శైలజ ఒక ప్రకటనలో తెలిపారు. చట్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించే నిమిత్తం పారా లీగల్ వలంటీర్లను ఎంపిక చేస్తున్నట్లు వివరించారు. పదో తరగతి లేదా అందుకు సమాన విద్యార్హత కలిగి 18 సంవత్సరాల నిండిన యువతీ, యువకులు ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 21వ తేదీలోపు హిందూపురం మండల న్యాయ సేవాధికారి సంస్థ కార్యాలయానికి చేరేలా చూసుకోవాలన్నారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి మౌఖిక పరీక్ష ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తామని తెలియజేశారు. అర్హత, ఆసక్తి కలిగిన యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చిన్నారుల కిడ్నాప్‌కు విఫలయత్నం !

- పోలీసులకు ఫిర్యాదు చేసిన హెచ్‌ఎం
- అలాంటి ఘటన ఏమీ జరగలేదంటున్న సీఐ



మడకశిర: పట్టణంలో చిన్నారుల కిడ్నాప్‌నకు దుండగులు విఫలయత్నం చేశారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. చౌటిపల్లి ప్రాథమిక పాఠశాలకు విద్యార్థులు ఉదయం ఇళ్ల నుంచి బయలుదేరి వస్తుంటారు. ఈ క్రమంలో కొందరు విద్యార్థులు బుధవారం ఉదయం 8.50 గంటలకు పాఠశాల వద్దకు వచ్చారు. ఆ సమయంలో కారులో వచ్చిన గుర్తు తెలియని దుండగులు 5వ తరగతి చదువుతున్న ఓ చిన్నారిని, 4వ తరగతి చదువుతున్న మరొక చిన్నారిని కిడ్నాప్ చేసేందుకు విఫలయత్నం చేశారు. పాఠశాల వద్ద ఉన్న మరికొందరు విద్యార్థులు చూసి కేకలు వేశారు. వెంటనే దుండగులు అప్రమత్తమై అక్కడి నుంచి పరారయ్యారు. ఆందోళనకు గురైన విద్యార్థులు అక్కడి నుంచి ఇళ్లకు వెళ్లి జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పారు. కొందరు తల్లిదండ్రులు పాఠశాల వద్దకు వచ్చి జరిగిన విషయాన్ని హెచ్‌ఎం లక్ష్మీనరసమ్మ దృష్టికి తీసుకెళ్లారు. హెచ్‌ఎం వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కిడ్నాప్ వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎంఈఓ భాస్కర్ తెలిపారు. తల్లిదండ్రులు పిల్లల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, తల్లిదండ్రులే తీసుకువచ్చి పాఠశాలల్లో వదలాలని సూచించారు. ఇదిలా ఉండగా పట్టణంలో చిన్నారుల కిడ్నాప్‌నకు గుర్తు తెలియని దుండగులు విఫలయత్నం చేసినట్లు జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి నిజం లేదని స్థానిక టౌన్ సీఐ రామయ్య తెలిపారు. ఇందుకు సంబంధించిన వీడియోను సీఐ ఆయన విడుదల చేశారు.

ప్రభవించని పరిశ్రమ

జాడ లేని ఎంఎస్‌ఎంఈలు

- గత ప్రభుత్వ హయాంలో వేలాదిగా ఏర్పాటు
- భారీగా ఉద్యోగ ఉపాధి అవకాశాల కల్పన
- కూటమి సర్కారులో పెట్టుబడులకు ఔత్సాహికుల వెనుకడుగు
- టీడీపీ నేతల వసూళ్ల బెదిరింపులతో దుస్థితి
- ఉన్న పరిశ్రమల్లోనూ ఉద్యోగుల తొలగింపు
- ఈ ఏడాది ఇప్పటివరకూ 71 యూనిట్లకే అనుమతులు



సాక్షి ప్రతినిధి, అనంతపురం: చంద్రబాబు హయాంలో నిరుద్యోగులకు ఉపాధి గగనమవుతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో సూక్ష్మ, మధ్య తరగతి పరిశ్రమలు ఏర్పాటు కాకపోవడంతో ఉద్యోగ ఉపాధి అవకాశాలు పూర్తిగా తగ్గిపోయాయి. 2019–24 వరకూ పరిశ్రమల ఏర్పాటులో కొత్త ఒరవడి ఉండేది. అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పరిశ్రమల ఏర్పాటుకు ఒక్కరంటే ఒక్కరైనా ముందుకు రాని దుస్థితి. ఏ నియోజకవర్గంలోనూ పెట్టుబడులకు అనుకూలంగా లేని పరిస్థితులు నెలకొన్నట్టు నిపుణులు చెబుతున్నారు. 20 లక్షల ఉద్యోగాలిస్తామని ఎన్నికలకు ముందు చెప్పిన చంద్రబాబు మాటలకు.. క్షేత్రస్థాయి పరిస్థితులకు పొంతన లేదని జనం వాపోతున్నారు. చివరకు గాలిమరల కంపెనీల్లో పనిచేసే వాచ్‌మెన్ ఉద్యోగాలను కూడా తొలగించారని చెబుతున్నారు.

బెదిరింపులతో బెంబేలు..

ప్రస్తుతం జిల్లాలో నెలకొన్న పరిస్థితులు పరిశ్రమలకు ఏమాత్రం అనుకూలంగా లేవనేది స్పష్టమవుతోంది. వాస్తవానికి బెంగళూరు–హైదరాబాద్ జాతీయ రహదారి వెంబడి రాప్తాడు నియోజకవర్గంలో ఎక్కువ పరిశ్రమలు నెలకొల్పడానికి అవకాశం ఉంది. కానీ నియోజకవర్గంలో పరిశ్రమలు పెట్టాలన్నా, వెంచర్లు వెయ్యాలన్నా, విల్లాలు కట్టాలన్నా, చివరకు భూములు కొనుగోలు చేయాలన్నా కప్పం కట్టాల్సి వస్తోంది. చిన్న ఇళ్లు కట్టుకుంటున్నా టీడీపీ నేతలు సైట్లకు వెళ్లి పనులను ఆపేస్తున్న పరిస్థితి. దీంతో చిన్న పరిశ్రమల ఏర్పాటుకు భూములు కొనేందుకు ఔత్సాహికులు భయపడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన యూనిట్లనే ఇప్పుడు కొనసాగించడం (క్యారీ ఫార్వర్డ్) చేస్తున్నారు.

ఉద్యోగాలు ఎక్కడా లేవు..

ఉమ్మడి జిల్లాలో డిగ్రీలు, ఇంజినీరింగ్ పూర్తిచేసిన వేలాదిమంది యువత ఉద్యోగాలు లేక ఇబ్బంది పడుతున్నారు. బాబు వస్తే 20 లక్షల ఉద్యోగాలొస్తాయని నమ్మి ఓట్లేసిన పాపానికి ఇప్పుడు ఉన్న చిన్న చిన్న ఉద్యోగాలూ ఊడిపోతున్నాయని, ఇదివరకే చేస్తున్న ఉద్యోగాలను కూటమి నేతలు బెదిరించి తొలగించేస్తున్నారని ఉరవకొండకు చెందిన ఓ వ్యక్తి ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న పరిశ్రమలు లేదా పెద్ద పరిశ్రమల్లో ఎక్కడా ఒక్క ఉద్యోగం లేదంటూ యువకులు నిట్టూరుస్తున్నారు.

ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకూ ఎంఎస్‌ఎంఈల పరిస్థితి ఇలా

వచ్చిన పరిశ్రమలు	71
బ్యాంకుల రుణాలు	రూ.2.01 కోట్లు
బ్యాంకులకు పంపిన దరఖాస్తులు	296
లోనుకు అర్హత సాధించినవి	134
కేవీఐసీ నుంచి మార్జిన్ మనీ వచ్చింది	39
ఆర్థిక సాయం అనుమతులు ఇచ్చింది	రూ.2.23 కోట్లు

గత ప్రభుత్వ హయాంలో పరిశ్రమల ఏర్పాటు ఇలా

ఎంఎస్‌ఎంఈలు	43,491
పెట్టుబడులు	రూ.1996 కోట్లు
ఉద్యోగాల కల్పన	1,62,135

ఎంబీఏ చేసినా ఉద్యోగం రాలేదు

నేను ఎంబీఏ పూర్తి చేశాను. జిల్లాకు కొత్తగా పరిశ్రమలు రాకపోవడంతో నాలాంటి వారికి ఉద్యోగావకాశాలు దక్కడం లేదు. మాకున్న పొలంలో వ్యవసాయం చేస్తున్నా పెద్దగా రాబడి లేదు. ఉద్యోగమూ లేక వ్యవసాయంలో లాభాలూ రాక చాలా ఇబ్బందులు పడుతున్నాం.

–కె.పరంధామరెడ్డి, చిన్మయనగర్

నిరుద్యోగిగానే ఉన్నా

పరిశ్రమలొస్తే ఏదో చిన్న ఉద్యోగం దొరికేది. కానీ కొన్ని నెలలుగా పరిశ్రమలే ఏర్పాటు కావడం లేదు. డిగ్రీ పూర్తిచేసినా ఉద్యోగం లేక ఇంటివద్దే ఉన్నాను. ఏదైనా చిన్న ఉద్యోగం వచ్చినా కుటుంబం ఒడ్డున పడుతుందని ఆశతో ఉన్నాను. పరిశ్రమలొచ్చే దిశగా ప్రభుత్వాలు కృషి చేయాలి.

–నరసింహారెడ్డి, ప్రసన్నాయపల్లి

బీమా ప్రీమియం చెల్లించండి

పుట్టపర్తి అర్బన్: ఈ ఏడాది రబీ సీజన్‌లో మామిడి, టమాట పంటలకు వాతావరణ ఆధారిత పంటల బీమా కోసం రైతులు ప్రీమియాన్ని ఈ నెల 15 లోపు చెల్లించాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రీమియం చెల్లించాలనుకునే రైతులు ఎకరా మామిడికి రూ.1650, ఎకరా టమాటకు రూ.1600 చెల్లించాలన్నారు. పంటలకు నష్టం జరిగితే మామిడికి ఎకరాకు రూ.33 వేలు, టమాటకు ఎకరాకు రూ.32 వేలు బీమా వర్తింపజేస్తారన్నారు. ప్రీమియం మొత్తాన్ని మీ సేవ, సీఎస్‌సీ సెంటర్లు, బీమా కంపెనీ నియమించిన ప్రతినిధుల ద్వారా, మొబైల్ నుంచి చెల్లించాలన్నారు. జిల్లా రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు మెగా పేరెంట్స్ మీట్



ప్రశాంతి నిలయం: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో ఈ నెల 7వ తేదీన నిర్వహిస్తున్న మెగా పేరెంట్స్–టీచర్స్ మీట్‌ను జిల్లాలో విజయవంతం చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ పిలుపునిచ్చారు. పేరెంట్స్–టీచర్స్ మీట్ ఏర్పాట్లపై గురువారం కలెక్టర్ ఒక ప్రకటన విడుదల చేశారు. సమావేశాలలో వన్–టూ–వన్ సమావేశాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థుల మానసిక, సామాజిక స్థితి, ప్రవర్తన ,అభ్యసనా సామర్థ్యం తదితర వివరాలను సంబంధిత క్లాస్ టీచర్, హెడ్‌మాస్టర్ పేరెంట్స్‌తో చర్చిస్తారన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధి బాధ్యత కేవలం పాఠశాల ఉపాధ్యాయులదే కాకుండా తల్లిదండ్రులది కూడా అన్న విషయాన్ని తెలియజేయడం జరుగుతుందన్నారు. ప్రతి విద్యార్థికి సంబంధించి ఆరునెలల రిపోర్టును అందిస్తామన్నారు. పాఠశాల అభివృద్ధికి పేరెంట్స్ కమిటీ, టీచర్స్ మీటింగ్ చాలా ఉపయోగపడుతుందన్నారు. ఎలాంటి రాజకీయ ప్రమేయం లేకుండా పూర్తిగా సామాజిక అభివృద్ధే ధ్యేయంగా పేరెంట్స్ - టీచర్స్ మీటింగ్ నిర్వహించాలన్నారు.

పురోగతి లేకపోతే చర్యలు తప్పవు



సమీక్షలో పాల్గొన్న హౌసింగ్ సిబ్బంది



మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ చేతన్

- గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయండి
- కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న పేదల ఇళ్ల నిర్మాణపు పనుల్లో పురోగతి లోపిస్తే సంబంధిత డీఈ, ఏఈలపై చర్యలు తప్పవని కలెక్టర్ టీఎస్ చేతన్ హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో జిల్లాలో గృహ నిర్మాణ శాఖ పనుల పురోగతిపై ఆ శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం పేదల ఇళ్ల నిర్మాణాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. హౌసింగ్ అనుబంధ శాఖల అధికారులు వారి పరిధిలోని పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 72,353 ఇళ్ల నిర్మాణాలు చేపట్టగా దాదాపు 22,500 పూర్తయ్యాయన్నారు. మిగిలిన ఇళ్లను 2025 మార్చి నాటికి పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. ఎప్పటికప్పుడు హౌసింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పనులను వేగవంతం చేయాలన్నారు. అలాగే ఆయా కాలనీల్లో మౌలిక వసతుల కల్పనపై కూడా దృష్టి సారించాలని సూచించారు. పనుల్లో పురోగతి మెరుగుపడకపోతే సంబంధిత ఏఈలు, డీఈలకు షోకాజ్ నోటీలు జారీ చేయడానికి ఫైల్‌ను సిద్ధం చేయాలని హౌసింగ్ పీడీని ఆదేశించారు. పెండింగ్ బిల్లులను వెంటనే అప్‌లోడ్ చేయాలని, త్వరితగతిన లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ వెంకటనారాయణ, డీఈలు శంకర్‌లాల్, శ్రీనివాస్, శివకుమార్‌నాయక్, రమణారెడ్డి, ఏఈలు పాల్గొన్నారు.

బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి

గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ హాజరును తప్పనిసరిగా వేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ నుంచి బయోమెట్రిక్ అటెండెన్స్, మిస్సింగ్ సిటిజెన్, జియో ట్యాగింగ్, ఎన్సీసీఐ, పాఠశాలల తనిఖీ తదితర అంశాలపై ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సచివాలయ సిబ్బంది ఇన్‌టైం, అవుట్‌టైం బయోమెట్రిక్ హాజరు వేర్వేరుగా గుర్తిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్‌పీసీఐ రామగిరి మండల పురోగతి మ్యాపింగ్‌ను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వెనుకబడిన మండలాలు పురోగతిని మెరుగుపరిచేందుకు తహసీల్దార్‌లతో సమన్వయం చేసుకోవాలని పలువురు ఎంపీడీఓలకు సూచించారు. నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంఎస్‌ఎంఈ రిజిస్ట్రేషన్‌లను మెరుగుపరిచేందుకు మున్సిపల్ కమిషనర్లు బాధ్యత వహించాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారి సుధాకర్‌రెడ్డి, డీపీఓ సమత, తదితరులు పాల్గొన్నారు.

సీడీపీఓ రెడ్డిరమణమ్మపై సస్పెన్షన్ వేటు

హిందూపురం టౌన్: ఐసీడీఎస్ హిందూపురం ప్రాజెక్టు సీడీపీఓ రెడ్డిరమణమ్మను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ చేతన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. హిందూపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాలకు పాల సరఫరాలో అక్రమాలు జరగడంపై జాయింట్ కలెక్టర్ విచారణకు ఆదేశించారు. దీనిపై ఐసీడీఎస్ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టడంతో అంగన్‌వాడీ కేంద్రాలకు పాల సరఫరాలో అక్రమాలు, అవకతవకలు పాల్పడినట్లు విచారణలో తేలింది. దీంతో నివేదికను కలెక్టర్‌కు పంపగా సీడీపీఓ రెడ్డిరమణమ్మను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రాజెక్టు పరిధిలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న శాంతికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి

చెన్నేకొత్తపల్లి/రామగిరి/కనగానపల్లి: రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని ఎస్పీ రత్న రామగిరి సీఐ శ్రీధర్‌కు సూచించారు. రామగిరి సర్కిల్ పరిధిలోని చెన్నేకొత్తపల్లి, రామగిరి, కనగాపల్లి పోలీస్‌స్టేషన్‌లను ఎస్పీ రత్న గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ ఆయా స్టేషన్‌ల పరిధిలోని నేరాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎక్కువగా ఎలాంటి కేసులు నమోదు అవుతున్నాయి? వాటిని ఏ విధంగా పరిష్కరిస్తున్నారు? తదితర వివరాలను సీఐతో పాటు ఎస్‌ఐలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో 'పల్లెనిద్ర' నిర్వహించి సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. సమస్యాత్మక గ్రామాలపై నిఘా ఉంచి, అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. డీఎస్పీ శ్రీనివాసులు, రామగిరి సీఐ శ్రీధర్, ఎస్‌బి ఎస్‌ఐ ప్రదీప్‌కుమార్, ఎస్‌ఐలు సుధాకర్‌యాదవ్, రిజ్వాన్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



రామగిరి పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ రత్న

ధర్మవరంలో మెగా హ్యాండ్‌లూమ్ క్లస్టర్



మాట్లాడుతున్న ఎంపీడీఓ మనోహర్

ధర్మవరం రూరల్: ధర్మవరం ప్రధాన కేంద్రంగా జాతీయ చేనేత అభివృద్ధి పథకం (ఎన్‌హెచ్‌డీపి) కింద రూ.35 కోట్లతో మెగా హ్యాండ్‌లూమ్ క్లస్టర్ మంజూరైనట్లు ఎంపీడీఓ సాయి మనోహర్ పేర్కొన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లకు బేస్‌లైన్ సర్వేపై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమానికి కేంద్ర టెక్స్‌టైల్స్ మంత్రిత్వశాఖ అధికారులు విశ్వజిత్, జి. నాగేశ్వరరావు, టెక్నికల్ సూపర్‌వైజర్లు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు మెగా హ్యాండ్‌లూమ్ క్లస్టర్‌ను 5 నుంచి 10 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తారన్నారు. ఇది నోడల్ సెంటర్‌గా పనిచేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాయి కీర్తనం... భక్తి నర్తనం



ప్రశాంతి నిలయం: సత్యసాయి చాటిన మానవతా విలువలను ప్రదర్శిస్తూ చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. పర్తియాత్రతో భాగంగా సింగపూర్‌కు చెందిన సత్యసాయి విద్యాసంస్థల విద్యార్థులు గురువారం సాయంత్రం సాయికుల్వంత్ సభా మందిరంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. సాయిని కీర్తిస్తూ నృత్య ప్రదర్శనిచ్చారు. అలాగే సత్యసాయి ఆధ్యాత్మిక సూక్తులను, మానవతా విలువలను చాటిచెప్పారు.

ఆధ్యాత్మిక సూక్తులు, మానవతా విలువలను చాటిచెప్పేలా ప్రదర్శన నిర్వహిస్తున్న సత్యసాయి విద్యాసంస్థల విద్యార్థులు





అనంతపురంలోని గంగ-గౌరీ కాంప్లెక్స్ వద్ద ప్రేక్షకుల కోలాహలం



పుష్ప.. పొలికేక

ఉమ్మడి అనంతపురం జిల్లా అంతటా పుష్ప-2 మేనియా నెలకొంది. అల్లు అర్జున్ హీరోగా నటించిన పుష్ప-1 సంచలన విజయం నమోదు చేయడంతో పార్ట్- 2పై అభిమానుల్లో అంచనాలు పెరిగిపోయాయి. సినిమా విడుదల కావడంతో థియేటర్లకు పోటెత్తారు. బుధవారం రాత్రి సినిమా బెనిఫిట్ షో నుంచే సందడి చేశారు. - సాక్షి నెట్‌వర్క్



చిన్నారులతో కలిసి పుష్ప-2 సినిమాను వీక్షిస్తున్న దృశ్యం



థియేటర్‌లో అభిమానుల సందడి

క్లుప్తంగా

గుర్తు తెలియని వృద్ధురాలి ఆత్మహత్య



వృద్ధురాలి మృతదేహం

గోరంట్ల: స్థానిక మార్కెట్ రోడ్డులో గురువారం ఉదయం గుర్తు తెలియని వృద్ధురాలు షాపింగ్ కాంప్లెక్స్ మెట్లకున్న ఇనుప గ్రిల్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు సమాచారం మేరకు పోలీసులు ఘటనస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతురాలికి 60 ఏళ్ల వయసుండొచ్చని పోలీసులు తెలిపారు. పంచాయతీ సిబ్బంది సాయంతో మృతదేహాన్ని పెనుకొండలోని మార్చురీకి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి



మృతుడు గోపాల్

రొద్దం: మోపర్లపల్లి సమీపాన బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. మోపర్లపల్లి గ్రామానికి చెందిన కురుబ గోపాల్(40) బైక్‌పై వెళ్తుండగా ప్రమాదవశాత్తూ అదుపుతప్పి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో బెంగళూరు తీసుకెళుతుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. పోస్టు మార్టం నిమితం మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..



మృతుడు దస్తగిరి

గోరంట్ల: పాలసముద్రం క్రాస్ సమీపంలో జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. సీఐ శేఖర్ తెలిపిన వివరాలు..పాలసముద్రం బీసీ కాలనీకి చెందిన దస్తగిరి(25) బైక్‌పై వెళ్తుండగా పాలసముద్రం క్రాస్ సమీపంలో 44వ నంబర్ జాతీయరహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

సైబర్.. యమడేంజర్!



- జిల్లాలో భారీగా వెలుగు చూస్తున్న సైబర్ నేరాలు
- గ్రామాలు, చిన్న పట్టణాలే నేరగాళ్ల టార్గెట్
- అమాయకత్వం, అత్యాశతో మోసపోతున్న ప్రజలు
- టెక్నాలజీ అందుబాటులోకి వచ్చినా తప్పని తిప్పలు
- బ్యాంకు ఖాతాల నుంచి మాయమవుతున్న నగదు
- పోలీసు గ్రీవెన్స్‌లో బాధితుల గోడు

❐ పెనుకొండ మండలం శెట్టిపల్లి గ్రామానికి చెందిన శ్రీరామ్‌నాయక్ సీఆర్‌పీఎఫ్ ఉద్యోగి. ప్రస్తుతం ఆయన పంజాబ్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. దీపావళి పండుగకు ఆయన స్వగ్రామానికి రాగా, జియో కంపెనీ పేరుతో పదే పదే ఫోన్ కాల్స్ వచ్చాయి. విసిగిపోయిన ఫోన్ లిఫ్ట్ చేయగా.. రూ.10తో రీచార్జ్ చేస్తే రూ.వెయ్యి జమ అవుతుందని అవతలి వ్యక్తి నమ్మబలికాడు. దీంతో శ్రీరామ్‌నాయక్ వాట్సాప్‌లో అతను పంపిన లింకును క్లిక్ చేశాడు. ఆ వెంటనే నాలుగు విడతల్లో రూ.6.79 లక్షల నగదు బ్యాంకు ఖాతా నుంచి ఇతరుల ఖాతాకు బదిలీ అయ్యింది. దీనిపై శ్రీరామ్‌నాయక్ భార్య ప్రమీలాబాయి ఈనెల 2వ తేదీన జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో ఫిర్యాదు చేశారు.

❐ సోమందేపల్లిలో ప్రముఖ బ్రాండ్ల ఫ్రాంచైజీలు ఇప్పిస్తానంటూ ఓ నేరగాడు రూ.కోట్లు కొల్లగొట్టాడు. సరుకు నిల్వ కోసం డిపాజిట్ చేయాల్సి ఉందని.. సాయంత్రానికే రూ.వందకు రూ.10 వడ్డీ ప్రకారం చెల్లిస్తానని స్థానికులను నమ్మించాడు. కొన్నిరోజులు చెప్పిన మేరకు వడ్డీ కూడా ఇచ్చాడు. దీంతో జనం అతన్ని నమ్మి రూ.లక్షలు ఇచ్చారు. అయితే రెండు వారాలు తర్వాత అతను అదృశ్యమయ్యాడు. ఆయన ఉంటున్న షాపు తాళం వేసి ఉంది. అందులో ఎలాంటి సరుకూ లేదు. దీంతో మోసపోయామని గ్రహించిన జనం పోలీసులను ఆశ్రయించారు.

❐ హిందూపురానికి చెందిన వారు వస్తువులపై భారీ రాయితీ పేరుతో అమాయకులను నిండా ముంచేశారు. దీనిపై బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఆన్‌లైన్ వేదికగా డబ్బులు చెల్లించామని.. ప్రస్తుతం ఫోన్ నంబరు పనిచేయడం లేదని.. సైట్ కూడా ఓపెన్ కావడం లేదని గగ్గోలు పెట్టారు.

..ఇలా జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల సైబర్ నేరాలు వెలుగు చూస్తున్నాయి. రోజుకో తరహాలో మోసాలు జరుగుతుండటంతో ఏది నిజమో.. ఏది కాదో అర్థం కాక జనం సతమతమవుతున్నారు. కొందరైతే కొత్త నంబర్ నుంచి ఫోన్ వస్తే లిఫ్ట్ చేసేందుకు కూడా భయపడిపోతున్నారు.

సాక్షి, పుట్టపర్తి

సైబర్ నేరాలు రోజురోజుకీ కొత్త పుంతలు తొక్కుతున్నాయి. స్మార్ట్ ఫోన్‌ను.. సామాజిక మాధ్యమాలను వేదికగా చేసుకుని సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. రోజుకో పంథాలో నిలువు దోపిడీకి పాల్పడుతున్నారు. జిల్లాలో సైబర్ బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. కొందరు అమాయకత్వంతో మోసపోతుంటే.. ఇంకొందరు అత్యాశకు పోయి బోల్తా పడుతున్నారు. బాధితుల్లో గృహిణుల నుంచి డాక్టర్లు, న్యాయవాదులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, మాజీ ఉద్యోగులు, నిరుద్యోగులు...ఇలా అన్ని వర్గాల వారూ ఉన్నారు.

అప్పుడు అలా.. ఇప్పుడు ఇలా..

ఏటీఎం కార్డు గడువు ముగిసిందని.. కేవైసీ అప్‌డేట్ చేయాలని.. బ్యాంకు ఖాతాకు ఆధార్ అనుసంధానం చేయాలని.. లాటరీ వచ్చిందని.. కరోనా సాయం మంజూరైందని.. ఇలా సైబర్ నేరగాళ్లు పలు కోణాల్లో అమాయకులకు మోసం చేసేవారు. ఫోన్‌లో వచ్చే ఓటీపీలు తెలుసుకోవడం, ఎనీ డెస్క్ ద్వారా స్క్రీన్ షేరింగ్ యాప్‌ల ద్వారా కంట్రోల్‌లోకి తీసుకుని బ్యాంకు ఖాతాలు ఖాళీ చేసేవారు. దీనిపై పోలీసులు అప్రమత్తమై అవగాహన కల్పించారు. దీంతో సైబర్ నేరగాళ్లు రూటు మార్చి గ్రామీణులను టార్గెట్ చేస్తున్నారు. కొత్త తరహా గిమ్మిక్కులతో ఖాతాలు కొల్లగొడుతున్నారు.

వ్యాపార అవకాశాల పేరుతో లూటీ..

ఏటీఎం కేంద్రాల ఏర్పాటు, ప్రముఖ బ్రాండ్‌ల కంపెనీల ఫ్రాంచైజీలు, మీ–సేవ కేంద్రాల ఏర్పాటు పేరుతో ఇటీవల కాలంలో ఎక్కువ మోసాలు చేస్తున్నారు. ముందుగా వీటికి సంబంధించిన ప్రకటనలను వాట్సాప్, టెలిగ్రామ్ గ్రూపుల్లో సర్క్యులేట్ చేస్తున్నారు. వీటిని నమ్మి ఎవరైనా వివరాలు పంపితే సెక్యూరిటీ డిపాజిట్, వెరిఫికేషన్ చార్జీలు అంటూ అందినకాడికి దండుకుని ఫోన్లు ఆఫ్ చేస్తున్నారు. మొబైల్ రీచార్జ్‌ల పేరుతోనూ సైబర్ నేరగాళ్లు జనానికి కుచ్చుటోపీ పెడుతున్నారు.



పోలీసులకు ఫిర్యాదు చేస్తోన్న ప్రమీలాబాయి (ఫైల్)

రికవరీలు కూడా కష్టమే..

సైబర్ కేసుల్లో రికవరీ కష్టంగా మారుతోంది. ప్రజల నుంచి కొల్లగొట్టిన డబ్బును నేరస్తులు నేరుగా డిజిటల్ వాలెట్‌లోకి పంపించి అక్కడి నుంచి అమెజాన్ వంటి సైట్లలో గిఫ్ట్ కార్డులు కొనుగోలు చేస్తున్నారు. ఈ గిఫ్ట్ కార్డులను ఆన్‌లైన్ ద్వారా ఇతరులకు అమ్మి డబ్బు పోగు చేసుకుంటున్నారు. నేరాలకు ఉపయోగించిన సిమ్‌కార్డు, నగదు లావాదేవీలకు వినియోగించిన బ్యాంకు ఖాతాలు వేర్వేరు వ్యక్తులకు సంబంధించినవి కావడం, గిఫ్ట్ కార్డు వాడుకునే వారు ఇంకెవరో కావడంతో రికవరీ కష్టంగా మారుతోందని పోలీసులు చెబుతున్నారు.

భారీగా రాయితీలు ప్రకటించి...

ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగామ్, టెలిగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాలను వేదికగా చేసుకుంటున్న సైబర్ చోరీలు... షాపింగ్ సైట్ల పేరుతో భారీ రాయితీలు ప్రకటిస్తున్నారు. ఆన్‌లైన్ బ్యాంకింగ్, క్రెడిట్, డెబిట్ కార్డు వివరాలు తస్కరిస్తున్నారు. ఇటీవల ఇలాంటి ఘటనలు చాలా వెలుగులోకి వచ్చాయి. ఇందుకోసం సైబర్ నేరగాళ్లు ముందుగా నకిలీ వెబ్ సైట్లు సృష్టిస్తున్నారు. అందులో స్మార్ట్‌ఫోన్లు, గృహోపకరణాలు, ఇతర వస్తువులపై 50 నుంచి 70 శాతం వరకు రాయితీలు ప్రకటిస్తూ సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తున్నారు. ఎవరైనా ఆశపడి సైట్‌లో ఆన్‌లైన్ బ్యాంకింగ్, క్రెడిట్ కార్డు వివరాలు నమోదు చేయడమే ఆలస్యం.. వాటి ఆధారంగా సైబర్ నేరగాళ్లు ఖాతాలు ఖాళీ చేస్తున్నారు.

అవగాహనతోనే మోసాలకు చెక్



అవగాహన కార్యక్రమాలతో సైబర్ మోసాలకు చెక్ పెట్టొచ్చు. ప్రజలు సామాజిక మాధ్యమాల్లో వచ్చే ప్రకటనలను గుడ్డిగా నమ్మొద్దు. అనుమానం వస్తే డబ్బు చెల్లించకుండా పోలీసులను సంప్రదించాలి. ఆన్‌లైన్‌లో ప్రకటనలపై అధీకృత వెబ్‌సైట్ చెక్ చేయాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ బ్యాంకు వివరాలు, ఓటీపీలు ఎవరికీ వెల్లడించకూడదు. – వి.రత్న, జిల్లా ఎస్పీ

స్థానికులకే ఉద్యోగావకాశాలు కల్పించాలి



కియా యాజమాన్యంతో మంత్రులు

పెనుకొండ రూరల్: కియా పరిశ్రమలో స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని మంత్రులు వాసంశెట్టి సుభాష్, సవిత కోరారు. గురువారం కార్మిక,పరిశ్రమల శాఖ మంత్రి వాసం శెట్టి సుభాష్, బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత కియా పరిశ్రమను సందర్శించారు. మంత్రులకు కియా సీఈవో కబ్ డాంగ్ లీ,హెచ్‌వోడీ మిస్టర్ హాన్ స్వాగతం పలికారు. మంత్రులు పరిశ్రమలోని వివిధ భాగాలను 3 గంటలు పాటు పరిశీలించారు. ఈ సందర్భంగా వాసం శెట్టి సుభాష్ మాట్లాడుతూ కియా,అనుబంధ పరిశ్రమలలో 20 వేల మంది వరకు ఉపాధి కల్పించడం హర్షణీయం అన్నారు. కియా యాజమాన్యం నూతన సాంకేతికతతో కార్లను ఉత్పత్తి చేస్తున్నట్లు తెలిపారు. కియా ట్రైనింగ్ సెంటర్‌లో అంతర్జాతీయ స్థాయిలో శిక్షణ ఇవ్వాలన్నారు. సీఎస్ఆర్ ద్వారా ప్రజలకు సేవలు అందించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ బాలు నాయక్, ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ కేశవులు, లేబర్ డిప్యూటీ కమిషనర్ లక్ష్మీనరసయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కుటుంబ పోషణలో మహిళలే కీలకం



మాట్లాడుతున్న ఆర్డీఓ సువర్ణ



పాల్గొన్న మండల సమాఖ్య సభ్యులు

పుట్టపర్తి అర్బన్: కుటుంబ పోషణలో మహిళలదే కీలక పాత్ర అని పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ పేర్కొన్నారు. గురువారం పుట్టపర్తి డీఆర్‌డీఏ జిల్లా కార్యాలయంలో జిల్లా సమాఖ్య 3వ మహాజన సభ జరిగింది. ఆర్డీఓతో పాటు డీఎస్పీ విజయ్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీఎంహెచ్‌ఓ డాక్టర్ మంజువాణి, డీపీఓ సమత, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సిద్ధగంగమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ డ్వాక్రా సంఘాలు మనుగడ సాధించాలంటే రుణ కంతులు క్రమం తప్పకుండా చెల్లించాలన్నారు. ఆర్థిక లావాదేవీల్లో సమర్థవంతంగా పని చేస్తున్న వారిని అధ్యక్షులుగా ఎన్నుకుని సంఘాలను అభివృద్ధి చేసుకోవాలని డీఎస్పీ విజయ్‌కుమార్ సూచించారు. డీపీఓ, డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ డ్వాక్రా మహిళల ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. డీఆర్‌డీఏ పీడీ మాట్లాడుతూ డ్వాక్రా మహిళల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆర్థికంగా ఎదగాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా సమాఖ్య ద్వారా చేపట్టిన కార్యక్రమాల వివరాలను ప్రగతిని నివేదించారు. శుక్రవారం జిల్లా సమాఖ్య ఎన్నికలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డీపీఎంలు రామిరెడ్డి, రామ్మోహన్, ఏరియా కోఆర్డినేటర్లు సత్యనారాయణ, రవీంద్ర, వెంకటనారాయణ, పద్మావతి, మాజీ అధ్యక్షురాలు ఈశ్వరమ్మ, 30 మండల సమాఖ్యల నుంచి ముగ్గురు చొప్పున సభ్యులు పాల్గొన్నారు.

విషజ్వరాలకు ఇద్దరు చిన్నారుల బలి





మృతులు దీవన్(ఫైల్), మేఘన(ఫైల్)

డి హీరేహాళ్(రాయదుర్గం): డి హీరేహాళ్ మండలం మడేనహళ్లిలో విష జ్వరాల కాటుకు ఇద్దరు చిన్నారులు బలైన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. మృతుల బంధువులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన గంగన్న, లక్ష్మి దంపతుల కుమారుడు జీ దీవన్ (4) కొద్దిరోజుల నుంచి విష జ్వరంతో బాధపడుతూ బళ్లారిలోని విమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. చికిత్స ఫలించకపోవడంతో మృత్యుఒడికి చేరాడు. తన కుమారుడు డెంగీ జ్వరంతోనే మృతి చెందాడని బాధిత తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే గ్రామంలోని బొమ్మయ్య, మూకమ్మ కుమార్తె మేఘన (7) మూడు రోజుల క్రితం పాఠశాల గేటుమీద నుంచి కింద పడింది. చికిత్స కోసం బళ్లారిలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే జ్వరంతో బాధపడుతున్న చిన్నారి పరిస్థితి విషమించింది. జ్వర తీవ్రత తట్టుకోలేక చిన్నారి మృతి చెందిందని తల్లిదండ్రులు, బంధువులు వాపోయారు. ఇద్దరు వరసకు దాయాదుల పిల్లలు కావడంతో రెండు కుటుంబాల్లోనూ తీవ్ర విషాదం నెలకొంది. గ్రామం మొత్తం శోకసంద్రంలో మునిగింది. దేవుడా ఎంత పనిచేశావ్ అంటూ కన్నీటి పర్యంతమయ్యారు.

వేరుశనగలో చీడపీడలు నివారించుకోండి



రబీ వేరుశనగ పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

పుట్టపర్తి అర్బన్: రబీలో వేరుశనగ సాగు చేసిన రైతులు మేలైన యాజమాన్య పద్ధతులను పాటించి చీడ పీడలను నివారించుకోవాలని కదిరి ప్రధాన శాస్త్రవేత్త బీవీ భాస్కర్‌రెడ్డి సూచించారు. గురువారం పుట్టపర్తి వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ శాఖ అధికారులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం బీడుపల్లిలో వేరుశనగ పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేరుశనగలో అధిక దిగుబడులు సాధించాలంటే కలుపు నివారణ చాలా ముఖ్యమన్నారు. నూతన వంగడాలైన కదిరి లేపాక్షి, కదిరి చిత్రావతి, కదిరి అమరావతి తదితర రకాలను సాగు చేయాలన్నారు. కలుపు నివారణ, ఎరువుల వాడకంపై పలు సూచనలు చేశారు. విత్తన శుద్ధిలో కిలో విత్తనానికి 2 ఎంఎల్ ఇమిడా క్లోఫెడ్ మందును 4 ఎంఎల్ నీటికి కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. తద్వారా వేరు పురుగు, రసం పీల్చు పురుగులను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ నరసింహులు, డాక్టర్ అనిత, డాక్టర్ రమేష్‌నాయక్, ఏఓ వెంకటబ్రహ్మం, రైతులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం



కారుణ్య నియామక ఉత్తర్వులు అందుకున్న వారితో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, సీఈఓ వెంకటసుబ్బయ్య

- జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ
- ఉమ్మడి జిల్లాలో 12 మందికి కారుణ్య నియామకాలు

అనంతపురం సిటీ: పంచాయతీరాజ్ అనుబంధం, జిల్లా పరిషత్, అనుబంధ విభాగాల్లో పని చేసే ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పని చేస్తూ వివిధ కారణాలతో మరణించిన వారి వారసులు 12 మందికి ఆఫీస్ సబార్డినేట్లుగా నియమించారు. జెడ్పీ కార్యాలయంలో గల తన చాంబర్‌లో సీఈఓ వెంకటసుబ్బయ్య, ఏ సెక్షన్ ఏఓ షబ్బీర్ నియాజ్‌తో కలసి నియామక పత్రాలు అందించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విధి నిర్వహణలో క్రమశిక్షణ, సమయ పాలన, చిత్తశుద్ధితో పని చేసి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు.

కారుణ్య నియామకాల కింద నియమితులైన వారికి కేటాయించిన స్థానాలు ఇలా..

ఉద్యోగి పేరు	కేటాయించిన ప్రాంతం
ఎస్.ముజఫర్ సుల్తాన్ నాజిరిన్	జెడ్పీ, అనంతపురం
బి.ఉమేశ్ కుమార్	జెడ్పీ, అనంతపురం
బి.నందిని	ఎంపీపీ, సోమందేపల్లి
ఎస్.బాలాజీ	ఎంపీపీ, నల్లచెరువు
టి.హేమంత్	ఎంపీపీ, బ్రహ్మసముద్రం
పి.ఉష	ఎంపీపీ, గుమ్మఘట్ట
బి.తిప్పేస్వామి	ఎంపీపీ, అమరాపురం
బి.ప్రమోద్	ఎంపీపీ, కొత్తచెరువు
బి.నిరోష వ్యాస్	ఎంపీపీ, అనంతపురం
జి.సుజాతమ్మ	జెడ్పీహెచ్ఎస్ గర్ల్స్, మడకశిర
జి.షెక్షా	ఎంపీపీ, కుందుర్పి
టి.శోభారాణి	ఎంపీపీ, బుక్కరాయసముద్రం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం





మృతులు వినోద్(ఫైల్) ఉమాదేవి(ఫైల్)

పావగడ: పావగడ తాలూకాలోని యల్లాపుర గ్రామంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బొమ్మతనహళ్లికి చెందిన ఇద్దరు దుర్మరణం చెందారు. వివరాలు.. గ్రామానికి ఉమాదేవి(52) యల్లాపురలో జరుగుతున్న పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొనడానికి పావగడ నుంచి కేఎస్ ఆర్టీసీ బస్సులో వెళ్లింది. వినోద్(23) తన పెద్దమ్మ(ఉమాదేవి)ను బైక్‌పై ఎక్కించుకుని ఇంటికి బయలుదేరాడు. ఇంతలో జాతీయ రహదారిపై వెనుక నుంచి వచ్చిన బొలెరో వాహనం బైకును బలంగా ఢీ కొట్టి ఆపకుండా వెళ్లిపోయింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. స్థానిక జెమిని పాటో స్టుడియో యజమాని రమేశ్‌కు ఒక్కగానొక్క కుమారుడైన వినోద్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. ఉమాదేవి భర్త బాబు రోదనలు మిన్నంటాయి. గురువారం సాయంత్రం వారికి గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

చలికాలంలో జాగ్రత్తలు తప్పనిసరి



వృద్ధురాలికి ఆరోగ్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

పుట్టపర్తి అర్బన్: చలికాలంలో వృద్ధులు, చిన్నారులు తప్పనసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సునీల్, ఆర్‌బీఎస్‌కే జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ నివేదిత పేర్కొన్నారు. గురువారం 104 వాహనం ద్వారా నిడిమామిడి ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంచు కురుస్తున్నందున చలి అధికంగా ఉంటుందని, దీంతో జలుబు, దగ్గు, జ్వరం లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఎవరూ ఆందోళన చెందకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రాత్రిపూట ఉలన్ రగ్గులను కప్పుకోవడం, కాచి చల్లార్చిన నీటిని తాగడం, దోమలు రాకుండా వేపాకు పొగ, దోమతెరలను వాడాలన్నారు. వైద్యాధికారి డాక్టర్ జ్యోత్స్న, సీహెచ్ఓ నగేష్, సూపర్‌వైజర్ వెంకటరమణ పాల్గొన్నారు.


మామిడి పూతను కాపాడుకోండి



నల్లగా మారిన మామిడి పూత

పుట్టపర్తి అర్బన్: ఇటీవల కురిసిన వర్షాలకు మామిడి తోటల్లో వచ్చే పూతను కాపాడుకోవాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్ కోరారు. ఈమేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. పూత, మొగ్గలు ఒకేసారి రావడానికి 13:0:45–7 గ్రాములు సూక్ష్మ ధాతువు 2 గ్రాముల నుంచి 3 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని తెలిపారు. తేనె మంచు పురుగు ఆశించిన తోటల్లో ఇమిడాక్లోప్రిడ్ 0.3 ఎంఎల్‌ను లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని పేర్కొన్నారు. వర్షాలు కురిసి నిలిచిపోయిన తర్వాత మొగ్గలపై మంచు ఏర్పడడంతో పూత నల్లగా మారి పిందె కట్టకుండా రాలిపోయే అవకాశం ఉన్నందున ఒక లీటరు నీటికి కార్బండిజమ్1 గ్రాముసు ఎం–45–2.5 గ్రాములు కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. ఈనెల 10,15 తేదీల తర్వాత మొగ్గలు కనిపించినట్లు అయితే ఒకసారి తేలికపాటి నీటి తడులు ఇవ్వాలని సూచించారు. తర్వాత బ్రాసినోలిడ్ మందును 0.5 ఎంఎల్ ను లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని పేర్కొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న హరిప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయులు

ఎన్‌పీకుంట: అన్నమయ్య జిల్లా కొత్తపల్లి జెడ్పీ ఉర్దూ పాఠశాలలో పాఠశాల సహాయకుడిగా పనిచేస్తున్న ఎజాజ్‌అహ్మద్ మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం సంతాప సభ నిర్వహించారు. ఈసందర్భంగా నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల దాడితోనే ఉపాధ్యాయుడు మృతి చెందాడన్న విషయం సోషల్ మీడియా ద్వారా తెలిసిందన్నారు. విద్యాబుద్ధులు నేర్పే గురువును గౌరవించాల్సింది పోయి ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడటం సభ్యసమాజం తలదించుకునేలా ఉందన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యను నేర్చుకొని భావి భారత పౌరులుగా ఎదగాల్సిన విద్యార్థులే దారితప్పి గురువులపై దాడికి పాల్పడటం హేయమన్నారు. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు ఎస్టీయూ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి



వృద్ధుడి మృతదేహం

పెనుకొండ: పట్టణంలోని వాసవీ కల్యాణమండపం వద్ద గురువారం గుర్తు తెలియని వృద్ధుడి(75) మృతదేహం లభించింది. సమాచారం అందుకున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడు నీలం రంగు ఫ్యాంట్, టీషర్టుతో పాటు లోపల బిస్కట్ రంగు కల షర్ట్ ధరించాడు. మృతుడి షర్ట్ కాలర్‌పై హర్ష, హిందూపురం అని ఉందని మృతుడు హిందూపురం ప్రాంతానికి చెందిన వాడిగా భావిస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.